# తా నొకటి తలంచిన దైవ మొకటి తలంచును

సుసర్ల సూర్యప్రకాశము గారు

"అబ్బబ్బా!! బడిబడియని మాయమ్మ నన్నుఁజంపితినివేయుచున్నది. బలవంతముగఁ బుస్తకములు చేతిలోఁ బెట్టి ప్రతి దినము నన్ను బడికి సాగనంపుచుండును. ఆమె కేమి తెలియును నాకష్టము. బడికిఁబోవుట యనఁగా గోలీలాడుటా? గోపురాలెక్కుటా? లెక్కలంట. పాఠములంట. ఛీ ఛీ! వాటి మాటయన్న నాకుఁ దలనొప్పి. పూర్వమొకటి కనియు రెంటికనియు వంకఁబెట్టుకొని వీథులలోఁ దిరుగు జతగాళ్లతో దాగుడు మూతలాడుకొనుచుండెడివాఁడను. ఇదియేమి కర్మమో యాదొంగతనము కనిపెట్టి కాఁబోలట్టిటు కదలకుండఁ బట్టుపట్టికూర్చుండఁ బెట్టుచున్నారు. అయ్యో! ఈమాయ చదువెక్కడి నుండివచ్చెను నాయనా! ఇఁకనేను వెళ్లను. ఈరోజు మొదలుకొని బడికిఁబోయినఁ గోమటి కొడుకును కాను" అని యొట్టుబెట్టుకొని చేతిలోని పుస్తకము లొకరి దొడ్డిలో మూలనున్న మునగచెట్టు మొదట జాగ్రత పెట్టి తల్లిదండ్రులతోఁ జెప్పకుండఁ దనయక్కగారి యూరికిఁ బ్రయాణమై పోవుచుండె నొక కోమటికుఱ్ఱవాఁడు.

పిల్లవాఁడు చేరవలసిన గ్రామము చేరకమునుపే సూర్యుఁడస్తాద్రిఁ గ్రుంకెను. బాలకుఁడు దారితప్పి యక్కగారియూరికి మూరు చిత్రాడ యను పల్లెటూరు ప్రవేశించెను. తనవారి యూరుకాదని తెలిసికొనినతోడనే దిగులుపడఁజొచ్చెను. ఆకటిచేఁ గడుపు నకనకఁబడుచుండెను. నిద్దుర ముందు వెనుకలకు జోగాడించుచుండెను. తిరిగితిరిగి తుదకొక యూరి వెలుపలి మేడయరుఁగుపైఁ బండుకొనియుండెను.

"ఓసీ! తెల్లవారిపోవచ్చెనే! నీకైన మెలఁకువ రాకపోయెఁగదా! జామురాత్రియైన లేదు. ఇప్పుడెక్కడ ప్రయాణము. తత్క్షణము వంట ప్రయత్నము చేయుము. భోజనముచేసియే ప్రయాణమయ్యెదను" అని యొకకాపు తనభార్యతో ననెను.

"వంటయన నెంత ? కూరయేమియుఁగానరాకున్నది." అని యాతనిభార్య పలికెను.

"అట్లయిన బట్టనపుఁ బిల్లను బలియిచ్చెదను" అని చేతఁ గత్తిఁబట్టుకొని దొడ్డిగోడలో నమర్పఁబడిన కోళ్ల గూటిని సమీపించెను.

"నన్ను చంపకు బాబూ! నన్ను చంపకు! చంపకు" అని కేకలు వేయుచు గూటిలోనుండి యొక కుఱ్ఱవాఁడు బైటఁబడెను. కాని కోళ్ల చప్పుడేమియు వినఁబడుటలేదు. ఆకాపువాని జూచినతోడనే "ఓరి కోళ్లదొంగా! దొరకితివిరా! దీనిలోని కోళ్లనేమిచేసితివో చెప్పుము. లేకున్న నీ ముక్కు, చెవులు కోసివేయుదును" అని యతఁ

బాలకుఁడు:—నేను దీనిలో దూరు నప్పుడు పారిపోయినవి.

కాపు:—దీనిలో నేల దూరవలెను?

బాల:—నీవు చంపెదనన్నావుకాదా?

కాపు:—ఛీ! దొంగా! నీవు నా కెప్పుడగపడితివి?

బాల:—అగపడలేదు. పట్టణపుఁబిల్లను బలియిచ్చెదనని నీవు యింటిలోననుచున్నావు. ఆమాటవిని నన్ను చంపెదవని యిక్కడ దాగికొన్నాను.

కాపు:—(కొంత గ్రహించి) మీదే యూరు?

బాల:—పిఠాపురము.

"ఓహో యిదియా కారణము. ఓ వెఱ్ఱి పిల్లవాఁడా! భయపడకు. నిన్నేమియుఁ జేయను. మీయూరిసంతలో నిన్న నొక కోడిపిల్లను గొనితెచ్చితిని. నేఁడు దానిని గూరచేసికొనఁ గోరి పట్టణపుఁ బిల్లను బలియిచ్చెదనని యంటిని. నీవును బట్టణపువాఁడవగుట నిన్నుఁ జంపుదునని భ్రమించితివి. రమ్ము" అనిచేరఁదీసి వాని వృత్తాంతము సవిస్తరముగఁ దెలిసికొని యాబాలకుని తలిదండ్రుల దాపునకుఁ దరలించెను.

గీ. ఒకని నిర్దోషవాక్యంబు నొకఁడు కపట
వచనముగనెంచి యాత్మను వందు రొకఁడు
కయ్యమును బెంచు నొక్కఁడు కష్టవితతిఁ
గాంచు విభ్రాంతమతిని నిష్కారణము

---

# పూలకన్నె

ఏనుఁగు లక్ష్మిరాజు గారు

చిన్ని చిన్ని పూలు
చిన్నారిపూలు
సొగసైనపువ్వులు
సొంపైనపూలు
గోరింటపువ్వులు
గొబ్బిపువ్వులు
భ్రమియింపఁజేసెడు
పసిఁడిపువ్వులు
అందమైన మంచి
చందనపూలు
మందారకుసుమాలు కురు

పువ్వులన్ని పైఁడి
బుట్టలోఁ బెట్టి
బుట్ట చేతఁబట్టి
పొలఁతియిటురాగ
పొలఁతి యందచంద
ములు తిలకించి
కలవరపడసాగె
గాంతునిమనము
మనమునం దెంతటి
మహిమలుండునో
మహిమలు దెలియంగఁ
మనదా నవపూవై?